కథ

## ఆకునూరి మురళీకృష్ణ

# విలువ

త్రినాధరావుగారి దగ్గర నుంచి వచ్చిన నోటీసుని చదివిన నేను ప్రపంచంలో ఎనిమిదో వింతని చూసినట్లు ఆశ్చర్యపోయాను. నమ్మలేని నిజాన్ని చూస్తున్నట్లుగా నోరు తెరుచుకుని అలా వుండిపోయాను.

నమ్మకం కుదరక మరోసారి చదివాను ఆ నోటీసుని. అక్షరం కూడా తేడా లేకుండా అదే భావం!


త్రినాధరావుగారి లాంటి మనిషి దగ్గర నుంచి అలాంటి నోటీసు వస్తుందని ఊహించలేదు. ఆయన మీద నాకున్న గౌరవం అలాంటిది మరి. అణగారిపోతున్న మన సంస్కృతీ సంప్రదాయాలనీ, విలువలనీ కాపాడడానికి నడుం బిగించి తనకి చేతనైన సహాయం చేస్తున్న మహనీయ వ్యక్తిగా నా దృష్టిలో ఆయనకున్న ఇమేజ్ వేరు.

తప్పుగా చదవలేదన్న విషయాన్ని రూఢీ చేసుకున్నాక ఆ నోటీసుమీద సంతకం చేసి, దాన్ని తీసుకుని వచ్చిన మా కాలనీ వాచ్‌మేన్‌కి తిరిగిచ్చేసి నేను ఆలోచనల్లో పడ్డాను.

ఊరికి దూరంగా విసిరేసినట్లుగా వుంటుంది మా కాలనీ. ఈ మహానగరంలో మధ్యతరగతి మానవుడు సొంతిల్లు కావాలనుకుంటే అయితే అపార్ట్‌మెంటేనా కొనుక్కోవాలి లేదా ఇలా సిటీకి దూరంగా అడివిలా వుండే సబర్బన్ ఏరియాలో ఇల్లు కట్టుకుని సిటిలో వుంటున్నామనుకుని సంతృప్తిపడేనా సరిపెట్టుకోవాలి.

కాంక్రీటు అరణ్యాలలాంటి ఆ అపార్ట్‌మెంటుల కన్నా సిటీకి కొంచెం దూరమైనా గాలీ వెలుతురూ ఆదే ఈ నిజమైన అరణ్యాలే నయమనుకునే నాలాంటివాళ్ళు కొందరు కలిసి కొనుక్కున్న స్థలాల్లో ధైర్యం చేసి ఇళ్ళు కట్టేసుకోవడంతో నాలుగైదు ఇళ్ళతో మా కాలనీ వెలిసింది.

మేం వచ్చిన కొత్తలో మా కాలనీ మీదుగా సిటీకి గంటకో బస్సుండేది. ఇప్పుడది పావుగంటకొకటిగా మారింది. అందరం సిటీకి దూరంగా వుండే వాళ్ళం. ఏ పని వచ్చినా సిటీకి వెళ్ళాల్సిన అవసరం ఉన్నవాళ్ళం కావడంతో సహజంగానే కొత్తలో కాలనీలో వున్న కొద్దిమందిమీ అన్యోన్యంగా, సన్నిహితంగా వుండే వాళ్ళం. ఎవరికే అవ



నరం వచ్చినా ప్రతీవాళ్ళం సహాయం చేసుకునేవాళ్ళం.

ప్రతీ చిన్న అవసరానికీ చాలా దూరం బస్సు ప్రయాణం చేయాల్సిరావడం తప్ప మరింకే పెద్ద ఇబ్బందీ లేని ఆ కాలనీ జీవితం మాకందరికీ సంతృప్తికరంగా వుండేది.

మమ్మల్ని చూసి మరికొందరు అక్కడ స్థలాలున్నవాళ్ళు ఇళ్ళు కట్టుకోవడానికి ధైర్యంగా ముందుకి రాసాగారు. మనుషులు పెరగడంతో అక్కడ క్రమంగా చిన్న చిన్న వ్యాపారాలు కూడా మొదలయ్యాయి. కిరాణ కొట్టు, కూరలకొట్టు, కేబుల్ టీవీ... ఇలా ఒక్కో సౌకర్యం మా కాలనీలో విస్తరిస్తున్న కొద్దీ మా ఆనందానికి అవధులు ఉండేవి కావు.

పెరుగుతున్న జనాభాని చూసి సౌకర్యాలు, సౌకర్యాలని చూసి వస్తున్న కొత్త జనాలు.. ఇలా మా కాలనీ దినదినాభివృద్ధి చెందసాగింది. అలాంటి పరిస్థితుల్లో త్రినాధరావుగారు ఇల్లు కట్టుకున్నారు మా కాలనీలో.

త్రినాధరావుగారు హెడ్మాస్టరుగా పని చేసి రిటైర య్యారు. పిల్లలంతా సెటిలైపోయారు. సర్వీసులో వుండగా కొనుక్కున్న స్థలంలో రిటైర్మెంట్ బెనిఫిట్‌గా వచ్చిన డబ్బులతో ఇల్లు కట్టుకున్నారు. ఆయన రాకతో మా కాలనీకే కొత్త కళ వచ్చినట్లయింది.


హెడ్మాస్టరుగా పని చేసిన అనుభవం వల్లో రిటైరైపోయి ఖాళీగా వుండటం వల్లో మా అందరినీ చిన్న పిల్లల్లా చూస్తూ మాకు పెద్ద దిక్కుగా వుండే వారు ఆయనా, ఆయన ధర్మపత్ని సావిత్రి.

ఏ విషయాన్నీ తమకెందుకులే అని వదిలిపెట్టే వాళ్ళు కాదు వాళ్ళిద్దరూ. ఎవరేనా అవసరాల్లో వుంటే అడగకుండానే సహాయం చేసేవారు. సమస్యల్లో వున్న వాళ్ళకి వాళ్ళ సమస్యలని అడిగి తెలుసుకుని మరీ సలహాలిచ్చేవారు. అలాగని అనవసర విషయాల్లో జోక్యం చేసుకునే వారు కాదు. ఒకరి విషయాలొకరికి చెప్పే వారు కాదు. కుడి చేత్తో చేసే సహాయం ఎడం చేతికి తెలిసేది కాదు. కుడి చెవితో విన్న విషయం ఎడమ చెవికి తెలిసేది కాదు!

వాళ్ళకి తెలిసిన యోగా, మెడిటేషన్ లాంటి విద్యలని కాలనీలో వాళ్ళకి ఆదివారాలప్పుడు నేర్పేవారు. ప్రతిఫలంగా ఏమీ పుచ్చుకునే వారు కాదు.

ఆ రకంగా తమ విలక్షణమైన వ్యక్తిత్వంతో చాలా కొద్దికాలంలోనే కాలనీలో అందరికీ ఆప్తమిత్రులైపోయారు ఆ దంపతులిద్దరూ. అందరం కలిసి మా కాలనీకి ఆయన్ని ప్రెసిడెంటుగా ఎన్నుకున్నాం. ఆయన ప్రెసిడెంటయ్యాక కాలనీలో తారు రోడ్డులు పడ్డాయి. స్ట్రీట్ లైట్లు వచ్చాయి. దొంగల భయం లేకుండా కాలనీకి ఒక వాచ్‌మేన్‌ని కూడా పెట్టుకున్నాం.

కాలనీలో ఇళ్ళు కట్టుకుంటున్న వారి సంఖ్య, అద్దెకి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. మా కాలనీలో స్థలం రేటు నాలుగు రెట్లు పెరిగింది. దీనంతటి వెనుకా త్రినాధరావుగారి కృషి చాలా వుందన్నది అందరికీ తెలిసిన విషయమే.




ఒకరోజు సాయంత్రం మా దాబా మీద కూర్చుని కాఫీ త్రాగుతూ పిచ్చాపాటీగా మాట్లాడుకుంటున్నాం నేనూ త్రినాధరావుగారూ. ఆరోజు ఉగాది పండుగ.

కాలనీలో అందరూ పండుగ సందర్భంగా టీవీలో వస్తున్న బ్లాక్ బస్టర్ సినిమాలు చూడడంలో నిమగ్నమైపోయారేమో, బయట జనం ఎవ్వరూ కనబడటం లేదు.

అస్తమిస్తున్న సూర్యుడు ఆకాశంలో ఎర్రగా మెరుస్తున్నాడు. చెట్లమీద గూటికి చేరిన పక్షులు కువకువలాడుతున్నాయి. దూరంగా రోడ్ మీద వెళుతున్న వాహనాలు వాల్యూం తగ్గించిన సినిమాలా కనబడుతున్నాయి శబ్దం పెద్దగా వినపడకపోవడంతో.

"మారిపోతున్న మన జీవన విధానం చూస్తుంటే బాధగా అనిపిస్తుందోయ్. మనం ఎటు వెళ్తున్నామా అనిపిస్తుంది" సందడి లేకుండా కనిపిస్తున్న కాలనీని చూస్తూ అన్నారాయన.

"ఎందుకలా అంటున్నారు మాష్టారూ?" అన్నాను నేను.


"మన కాలనీని చూడు.. ఇవాళసలు పండుగలా ఎక్కడేనా వుందా? అసలు పండుగలకీ పర్వదినాలకీ అర్థం మారిపోయి చాలా కాలమైపోయింది. పండుగంటే ఇప్పుడు మనకి వారం మధ్యలో అదనంగా వచ్చే మరొక సెలవుదినం మాత్రమే"

"నిజమే" అన్నాను నేను ఆయన మాటలతో ఏకీభవిస్తూ.

"మన జీవన విధానమే అలా తయారయిపోయింది. వారమంతా ఉరుకులూ పరుగుల జీవితం. వారాంతం వచ్చేసరికి నీరసంగా ఇంట్లో టీవీలకి అతుక్కుపోవడం లేదా ఇంటర్‌నెట్ గూట్లో తల దూర్చుకోవడం. మనం ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకోవడానికి కూడా తీరిక లేకుండా తయారవుతున్నాం. పండుగలని, పర్వదినాలని మనం ఎప్పుడో మర్చిపోయాం. వాటిని జరుపుకోవడం కన్నా టీవీల్లో చూసి ఆనందించడమే ఎక్కువైపోతోంది" అన్నారాయన బాధగా.

## అమీషా కొత్త లవ్!

నిర్మాతా-దర్శకుడు విక్రమ్ భట్‌తో అమీషా పటేల్ ప్రేమాయణానికి ఇక తెరపడినట్టేనని బాలీవుడ్‌లో వార్త గుప్పుమంది. నిన్నమొన్నటి వరకూ చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఈ జంట మధ్య గోడవేదో వచ్చిందని, విడిపోయి దూరంగా వుండేందుకే నిర్ణయించుకున్నారని ఇద్దరి సన్నిహితులూ చెవులు కొరుక్కుంటున్నారు. అసలు ఈ కథ ఇలా మారడానికి కారణం లండన్‌కి చెందిన ఓ ఎన్నారై బిజినెస్ మాన్ కొత్తగా హీరోగా మారడమేనట. అమీషాపటేల్‌ని ఆకట్టుకున్న ఈ కొత్త ప్రేమికుడు ఎంతకాలం వుంటాడో మరి!



"విదేశాల్లో కూడా గొప్పగా చెప్పుకునే సంస్కృతి మనది. కానీ ఇప్పుడు మన సంస్కృతి సంప్రదాయాల గురించి ఎవరేనా చెబితేకానీ తెలుసుకోలేని దుస్థితిలో వున్నాం మనం" అన్నారాయన మరింత బాధగా.

కేవలం బాధపడి ఊరుకుంటే త్రినాధరావుగారు కూడా అందరిలాంటి మామూలు మనిషే అయివుండే వారు. కానీ ఆయన మామూలు మనిషి కాదనడానికి నిదర్శనం నాకు సరిగ్గా రెండు నెలలు కూడా తిరక్కుండానే కనబడింది.

ఆ యేడాది శ్రీరామనవమికి సీతారామ కళ్యాణం తమ ఇంటి ముందున్న ఖాళీస్థలంలో పందిరి వేయించి త్రినాధరావు దంపతులిద్దరూ జరిపించారు. మా కాలనీలో అదే మొదటిసారి శ్రీరామనవమి జరపడం.

వాళ్ళిద్దరే స్వయంగా అన్ని ఏర్పాట్లూ చేసుకుని వాళ్ళింట్లో పెళ్ళిలా జరిపించారు కాలనీ అందర్నీ పిలిచి. తాటాకు పందిళ్ళు, మామిడాకుల తోరణాలు, బంతిపూల మాలలు, చక్కగా అలికిన నేల మీద మెరుస్తున్న ముత్యాల ముగ్గులు... చూస్తున్న వాళ్ళందరికీ కొంతసేపు తామెక్కడున్నారో అర్థంకాలేదు!

ఆ పందిట్లో వాళ్ళు పంచిన వడపప్పు, పానకం రుచిని ఏడాదిదాకా ఎవరూ మర్చిపోలేకపోయారు.

కళ్యాణాన్నే కాక నవరాత్రులని కూడా జరిపించారు వాళ్ళు. మామూలుగా జరిగే నవరాత్రి ఉత్సవాలకి భిన్నంగా తమదైన శైలిలో జరిపించి అందరినీ ఆకట్టుకున్నారు.

కాలనీలోని యువతకీ చిన్న పిల్లలకీ రోజుకొక రకమైన పోటీలు...తెలుగు పాటల పోటీలు... వ్యవహారిక భాషలో పురాణేతిహాసాలకి సంబంధించిన కథలు చెప్పే పోటీలు... త్యాగరాజ కీర్తనల పోటీలు... సంప్రదాయ నృత్యాలు... ఇలా వైవిధ్యంగా రచించారు నవరాత్రుల కార్యక్రమాలని దంపతులిద్దరూ కలిసి.

ఆ కార్యక్రమాలు పాల్గొనే వాళ్ళకి ఉత్సాహంగానూ, చూసే వాళ్ళకి చక్కని కాలక్షేపంగానూ ఉండేవి. అవెంతగా క్లిక్ అయ్యాయంటే వాటి పుణ్యమా అని కాలనీలోని పిల్లలంతా పురాణాల గురించీ, రామదాసు, త్యాగయ్యల గురించి పెద్దవాళ్ళనడిగి తెలుసుకోవడానికి పోటీలు పడేవారు. ఆ తొమ్మిది రోజులూ టీవీ ముఖం కూడా చూడలేదెవరూ.

అలా మన సంప్రదాయాన్ని చాలా తియ్యగా రుచి చూపించారు త్రినాధరావుగారు కాలనీలోని వాళ్ళకి. అది ప్రారంభం.

ఆ తర్వాత తరచుగా ఆయన పండుగలకి తమ ఇంట్లో ప్రత్యేకమైన కార్యక్రమాలని ఏర్పాటు చేయడం, ఆ పండుగ నేపథ్యాన్ని వివరించే వైవిధ్యమైన పోటీలనో కార్యక్రమాలనో తయారుచేసి అందరినీ పాల్గొనేలా చేయడం మొదలు పెట్టారు.

## ఐదేళ్ల తర్వాతే పెళ్లి!

*ఇప్పటికే టింగణా అయిపోయిన కరీనాకపూర్‌ని పెళ్లెప్పుడని అడిగితే 'మరో ఐదేళ్ల వరకూ పెళ్లి చేసుకునే ప్రసక్తే లేదు' అంటూ చెప్పేస్తోంది. తన కొత్త ప్రియుడు సైఫ్ అలీ ఖాన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగేస్తూ- ఇలా సరదాగా తిరిగినంత మాత్రాన వెంటనే పెళ్లి చేసేసుకోవాలా? అని ఎదురు ప్రశ్నలేస్తోందిట. 'టషన్' అనే సినిమాలో కలిసి నటిస్తున్న ఈ జంట ప్రస్తుతం ప్రేమసాగరంలో మునిగితేలుతున్నారని బాలీవుడ్డంతా కోడై కూస్తోంది.*



తాము ఏర్పాటు చేసుకునే 'థీమ్ పార్టీ'ల లానే ఇవి కూడా వైవిధ్యంగా వుండడంతో యువతరం కూడా ఉత్సాహంగా రాసాగారు.

కేవలం పండుగల్లోనే కాకుండా అప్పుడప్పుడు పెద్దలకి విడిగా పిల్లలకి విడిగా సమావేశాలు ఏర్పాటుచేసి తత్వశాస్త్రాలని, పురాణేతిహాసాలని సులభతరంగా బోధించడం, ఒక్కో అంశం మీద చర్చా కార్యక్రమాలు నిర్వహించడం కూడా చేసేవారు.

రొటీన్ జీవితాలతో విసిగిపోతున్న కాలనీ వాసులకందరికీ ఇదంతా ఆసక్తికరంగా అనిపించడంతో అందరూ ఆయన్ని మరింత ప్రోత్సహించి ముందుకు నడిపించడం మొదలుపెట్టారు.

ఇదంతా మొదలై సంవత్సరం దాటుతోంది. కాలనీ వాసులంతా ఒక రకంగా వీటికి అలవాటు పడిపోతున్న సమయంలో త్రినాధరావుగారి దగ్గర నుంచి అలాంటి నోటీసు రావడం మింగుడు పడకుండా వుంది నాకు.

కృష్ణాష్టమి సందర్భంగా జరుగబోయే ఉట్టి సంబరాల్లో పాల్గొనమని అందరికీ పంపిన ఆహ్వానం అది. ఆ సందర్భంగా వాళ్ళు రూపొందించిన వినూత్న కార్యక్రమాల వివరాలు వున్నాయి దానిలో. ఈసారి కార్యక్రమాల సరళి కొద్దిగా ఆకర్షణీయంగా మారి ప్రతి ఒక్కరికీ మిస్సవ్వకూడదనిపించేలా వుండడం గమనించాను. అంతవరకూ బాగానే వుంది. చివర్లో కొత్తగా చేర్చిన కొన్ని వాక్యాలే నన్ను ఆశ్చర్యానికి గురి చేసాయి. ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవారు తలకింతని ప్రవేశ రుసుము చెల్లించాలని అలా చెల్లించినవారికే అందులో పాల్గొనడానికి అనుమతి లభిస్తుందని ఆ వాక్యాల సారాంశం!

మన సంస్కృతీ సంప్రదాయాలు అడుగంటిపోతున్నాయని బాధ పడిన త్రినాధరావుగారేనా అలా రాసి పంపించింది? నా మనసంతా చేదుగా అయిపోయింది.

ఏమిటి మన సంప్రదాయం?

ఏం చెబుతోంది మన సంస్కృతి? పండుగల పేరుతో వ్యాపారం చేయమని చెబుతోందా?

త్రినాధరావుగారి మీదున్న గౌరవం పోయి దాని స్థానంలో ఆయన మీద కొత్త కొత్త అనుమానాలు కలుగసాగాయి. ఆ రోజంతా అన్యమనస్కంగానే గడిపాను. రోడ్డు మీద త్రినాధరావుగారు ఎదురుపడి పలకరించినా మనస్ఫూర్తిగా ఆయనతో మాట్లాడలేకపోయాను.

కొత్తగా చేర్చిన ఈ నిబంధనతో మన సంస్కృతీ సంప్రదాయాలని నిలబెట్టాలన్న ఆయన ఆశలూ ఆశయాలూ నెరవేరకుండా ఆయనే అడ్డుగోడ కట్టుకున్నాడనిపించింది. అంతలోనే నా ఆలోచనకి నాకే నవ్వొచ్చింది. అసలదంతా నిజంగా ఆయన ఆశయమేనా? లేక ఆ రకంగా మొదలుపెట్టి అందర్నీ ఆకట్టుకుని ఆ పేరుతో వ్యాపారం చేయాలనుకున్నాడా?

రకరాకాల ప్రశ్నలు నన్ను వేధించసాగాయి.

* * *

'ప్రవేశ రుసుము' అంశం నన్ను బాధించినంతగా మరెవరినీ బాధించలేదన్న విషయం కృష్ణాష్టమి రోజున అక్కడికి వచ్చిన జనాలని చూస్తే అర్థమయింది నాకు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువ మందే వచ్చారు.

వాళ్ళని చూసి నేను ఆశ్చర్యపోయాను. బాగా ఆలోచిస్తే అర్థమయింది నాకు. వాళ్ళంతా ఈ తరం మనుషులకి ప్రతినిధులు. వాళ్ళకి త్రినాధరావుగారు ఎలాంటి వారన్న విషయం అవసరంలేదు. అక్కడికి రావడం వల్ల ఆయన అందించే ఆనందం, థ్రిల్ ఎంతన్నదే వాళ్ళకి ముఖ్యం. అక్కడికి రావడం ద్వారా వాళ్ళెంత ఆనం

దాన్ని పొందారో అన్నదే వాళ్ళకి ప్రధానం. అందుకు కారణమైన వాళ్ళ వ్యక్తిత్వం ఎలాంటిదన్న విషయం వాళ్లకి అనవసరం.

అందుకే వాళ్ళంతా 'ప్రవేశ రుసుము' అన్న అంశాన్ని విస్మరించి ఆనందించ గలుగుతున్నారు. దాన్ని కూడా ఒక 'థీమ్ పార్టీ'లా ఎంజాయ్ చేయగలుగుతున్నారు. త్రినాథరావుగారిని వ్యక్తిగతంగా అభిమానించే నాలాంటి వాళ్ళం కొంతమందిమి మాత్రం ఆరోజు అంతగా ఆనందించలేకపోయాము.

అయితే చాలాకాలం తర్వాత ఆరోజు కార్యక్రమాలు మొదట్లో జరిగినంత క్రమశిక్షణగా జరిగినట్లు, ఆహుతులంతా శ్రద్ధగా వాటిలో పాల్గొన్నట్లు గమనించాను నేను అంత ముభావంలో కూడా.

త్రినాథరావుగారి ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. హాజరైన వాళ్ళందరి దగ్గరా ముందే సావిత్రి గారు నోటీసులో సూచించిన పట్టిక ప్రకారం డబ్బులు వసూలు చేసేసారు.

'వాటిని తలుచుకునేమో ఆయన ముఖంలో అంత ఆనందం' అనిపించింది నాకు.

యథాప్రకారం ముగింపులో త్రినాథరావుగారి ఉపన్యాసం. మన సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యాన్ని వివరిస్తూ... అందరూ ఆసక్తిగా వింటుంటే నాకు మాత్రం వినబుద్ధేయక బయటికి వచ్చేసాను. కనీసం ఆ ఉపన్యాసంలోనైనా ప్రవేశ రుసుముని ఎందుకు విధించాల్సి వచ్చిందో దానిని సమర్థించుకోవడానికి నాలుగు ముక్కలు చెబుతారని ఆశించి బయటి నుంచి కూడా ఆశగా ఆయన మాటలని విన్నాను. కానీ ఆయన లౌక్యంగా అందరికీ కృతజ్ఞతలు చెప్పి వదిలేసాడే తప్ప ఆ విషయాన్ని ప్రస్తావించలేదు!

★ ★ ★

ఆ తర్వాత కాలనీలో చాలా రోజులు త్రినాథరావు గారు చేసిన కృష్ణాష్టమి గురించే కబుర్లు. ఆ ఉత్సవాన్ని ఆయన జరిపిన తీరు అందరికీ చాలా నచ్చింది. ఎప్పటిలా నేను అలాంటి సంభాషణల్లో మనస్ఫూర్తిగా పాలు పంచుకోలేకపోతున్నాను. త్రినాథరావుగారి పట్ల నాకు తెలియకుండానే నా మనసులో కోపం పెరిగిపోసాగింది. ఆయన మాత్రం కలిసినపుడల్లా నవ్వుతూ పలకరిస్తూనే వున్నాడు. ఉండబట్టలేక ఒకసారి ఆయనతో అనేసాను.

"మీరు చేసిన పని నాకేం నచ్చలేదండి" అని.

"ఏ పని?" అన్నారాయన.

"కృష్ణాష్టమి ఉత్సవాలకి ప్రవేశ రుసుముని వసూలు చేయడం" అన్నాను.

"నాకూ నచ్చలేదు. కానీ తప్పట్లేదు. ఇకనుంచీ నేను చేసే ప్రతీ కార్యక్రమానికీ ఇలాగే చేద్దామనుకుంటున్నాను. చూసావుగా మొన్నటి ప్రోగ్రాం ఎంత సక్సెస్ అయిందో" అన్నారాయన నవ్వుతూ.

నాకు ఒళ్ళు మండిపోయింది. "సక్సెస్ అవడం అంటే ఏమిటి? ఎక్కువ డబ్బులు వసూలు చేయడమా? మీరిలాంటి వారనుకోలేదు మాస్టారూ. మీకు డబ్బు సమస్య అయితే మాలాంటి వాళ్లతో చెబితే డొనేషన్స్ ఇచ్చేవాళ్ళం కదా" అన్నాను బాధగా.

నేనన్నదానికి ఆయన చిన్నగా నవ్వారు.

"డబ్బు నా సమస్య కాదోయ్. అలా అనుకునే వాడినే అయితే అసలిలాంటివాటిని మొదలు పెట్టేవాడినే కాదు. నా ఆశయం వేరు" అన్నారాయన.

"మరేమిటి మీ సమస్య? ఎందుకలా చేసారు?" అడిగాను.

ఆయన నెమ్మదిగా చెప్పసాగారు.

"నువ్వు గమనించావో లేదో కానీ ఈ మధ్యకాలంలో నేను నిర్వహిస్తున్న కార్యక్రమాల పట్ల మన వాళ్ళకి శ్రద్ధ తగ్గింది. కార్యక్రమాలకి అందరూ పేరుకి హాజరవుతున్నా కార్యక్రమంలోని విశేషాల మీద ఎవరికీ దృష్టి వుండటంలేదు. ఎవరి కబుర్లు వారు చెప్పుకునే వాళ్ళు కొందరైతే ఎప్పుడొస్తారో ఎప్పుడు వెళిపోతారో తెలియని వారు కొందరు. రాను రాను ఇదంతా నా తృప్తికోసం నేను జరుపుకునే చాదస్తపు వ్యవహారంలా తయారవుతోంది. అందుకు కూడా నేను బాధపడలేదు. కానీ నేనేదైతే ఆశించి ఇదంతా చేస్తున్నానో ఆ ఆశయం... మన సంస్కృతీ సంప్రదాయాల పట్ల మనలో ఒక తీయని అనుభూతిని, అవగాహనని కలిగించి వాటి విలువలని వాళ్ళ ద్వారా ముందు తరాలవారికి అందించాలన్న నా ఆ ఆశయం నెరవేరకుండా పోతోందన్నదే నన్ను ఎక్కువగా బాధించింది" అంటూ ఆగారాయన.

ఆయన చెప్పినది నిజమే. కానీ దానికీ ఇలా డబ్బులు వసూలు చేయడానికీ సంబంధం ఏమిటో అర్థం కాలేదు. నా అనుమానాన్ని గ్రహించినట్లుగా ఆయన చెప్పసాగారు.

"బాగా ఆలోచిస్తే నాకు ఒక విషయం అర్థమయిందోయ్. ఈ ఆధునిక యుగంలో మనిషి దేని విలువ తెలుసుకోలేకపోయినా డబ్బు విలువని మాత్రం బాగా తెలుసుకున్నాడు. ప్రతీ దాన్నీ డబ్బుతో కొలవడం బాగా నేర్చుకున్నాడు. ఖర్చు చేయడానికి వెనుకాడడంలేదు కానీ తను ఖర్చు చేసే ప్రతి రూపాయికీ నూరు శాతం ఫలితం రాబట్టుకోవడం నేర్చుకున్నాడు"

నాకు నెమ్మదిగా విషయం అర్థమవసాగింది.

"విజ్ఞానమవనీ, వినోదమవనీ, డబ్బు పెట్టి కొనుక్కొంటే కానీ దాని విలువ తెలుసుకోలేని స్థితిలో వున్నాం మనం. అంతే కానీ నాకు డబ్బు అవసరమై కాదు" అంటూ నవ్వారాయన.

మొన్న జరిగిన కార్యక్రమంలో అందరూ ఎన్నడూ లేనంత శ్రద్ధగా, క్రమశిక్షణతో ఉండడం గుర్తొచ్చి నవ్వొచ్చింది నాకు.

"వసూలయిన డబ్బంతా ఇదుగో ఈ అకౌంట్‌లో వేసాను మన కాలనీ వెల్ఫేర్ ఫండ్ కింద" అంటూ బ్యాంక్ పాస్ బుక్ చూపిస్తున్న ఆయన వంక ఆరాధనగా చూసాను.

కొన్ని కొన్ని తప్పులని ఆలస్యంగానే గుర్తిస్తాము. ఆయనతో మాట్లాడిన చాలా రోజులకిగానీ నా తప్పు నేను గ్రహించలేకపోయాను. అంతకు ముందు ఎంతో గొప్పగా కనిపించిన ఆయన చర్యలు ప్రవేశ రుసుము అనగానే వ్యాపారంలా ఎందుకు కనిపించాయో తల్చుకుంటే నాకే సిగ్గుగా అనిపించింది.

'ఈ ఆధునిక యుగంలో మనిషి దేని విలువ తెలుసుకోలేకపోయినా డబ్బు విలువని మాత్రం బాగా తెలుసుకున్నాడు' అన్న ఆయన మాటలు ముల్లులా గుచ్చుకున్నాయి.

☆

## మరో చాన్స్

చెల్లెలు జ్యోతిక పెళ్లిచేసుకుని సినిమాలకు గుడ్‌బై చెప్పేయడంతో ఆ ఖాళీని తనే పూరించాలనుకుంటోంది కాబోలు నగ్మా, తమిళ దర్శకుడు బాలూ మహేంద్ర తీయబోయే ఓ సినిమాలో నాయికగా నటించడానికి ఒప్పుకుందిట. ముందుగా ఇందులో మాళవికను అనుకున్న బాలూ మహేంద్ర తర్వాత నగ్మా పట్ల ఆకర్షితుడయ్యాట్ట. నాలుగైదేళ్లుగా భోజ్‌పురి సినిమాలతో బిజీగా వున్న నగ్మా ఇంత గ్యాప్ తర్వాత దక్షిణాదిన అడుగుపెడుతోంది. అదృష్టం కలిసొస్తుందేమో!

